



PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్

# సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు




సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.


| శనివారం 22 ఆగస్టు 2026 | పేజీలు : 08 | వెల : 2/- | సంపుటి:02 సంచిక : 81 | ప్రచురణ : సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|

# అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరణ.. లండన్ నుంచే హైదరాబాద్‌కు సీఎం రేవంత్‌రెడ్డి



ఆగస్టు 22 (సందేశం టైమ్స్ ప్రతినిధి): తెలంగాణ అభివృద్ధి, యువతకు ప్రపంచస్థాయి విద్యా, నైపుణ్య అవకాశాలను అందించాలనే లక్ష్యంతో చేపట్టిన అధికారిక పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణరైజింగ్ ప్రతినిధి బృందం అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. అమెరికా పర్యటనకు సంబంధించి రాజకీయ కోణంలో అనుమతి ఇవ్వలేమంటూ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నుంచి సమాచారం అందడంతో బోస్టన్, న్యూయార్క్ తదితర ప్రాంతాల్లో జరగాల్సిన పర్యటనను రద్దు చేసుకోవాలని సీఎం నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఆగస్టు 23న లండన్ నుంచి హైదరాబాద్‌కు తిరిగి రానున్న సీఎం రేవంత్‌రెడ్డి, అమెరికా పర్యటనకు తాను వెళ్లకపోయినా అధికారులు మాత్రం నిర్దేశిత కార్యక్రమాలను కొనసాగించి హార్వర్డ్ విశ్వవిద్యాలయం, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (MIT), నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీ, వర్జీనియా టెక్ వంటి ప్రముఖ విద్యాసంస్థలతో అవగాహన ఒప్పందాలు, భాగస్వామ్య ఒప్పందాలను కుదుర్చుకోవాలని ఆదేశించారు. కేంద్ర నిర్ణయంపై స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి, ప్రపంచంలోని అత్యుత్తమ విద్యాసంస్థలను తెలంగాణకు, హైదరాబాద్‌కు తీసుకురావడం, యువతకు అత్యున్నత విద్య, నైపుణ్యాలు, శిక్షణ అందించడం తమ పర్యటన ప్రధాన ఉద్దేశమని తెలిపారు. దేశ నిర్మాణం, యువత భవిష్యత్తు విషయంలో రాజకీయాలకు అతీతంగా ఆలోచించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దాలన్నదే తన సంకల్పమని, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, జేఎన్‌టీయూ వంటి విద్యాసంస్థలతో హైదరాబాద్ అత్యుత్తమ మానవ వనరులకు కేంద్రంగా ఎదిగిందని వివరించారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ నుంచి ప్రపంచస్థాయి సాంకేతిక నాయకులు ఎదిగారని, ఐఐటీ, ఐఎస్‌బీ, ఐఐఐటీ, నల్సార్ వంటి సంస్థల రాకతో ప్రముఖ కార్పొరేట్ సంస్థలు, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లను హైదరాబాద్ ఆకర్షించిందని తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రపంచంలోని అత్యుత్తమ విద్య, నైపుణ్య సంస్థలకు హైదరాబాద్‌ను కేంద్రంగా మార్చి 21వ శతాబ్దపు తెలంగాణ అభివృద్ధికి బలమైన పునాది వేస్తామని సీఎం పేర్కొన్నారు. లండన్‌లో తన పర్యటనలో భాగంగా ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, లండన్ బిజినెస్ స్కూల్, యూనివర్సిటీ ఆఫ్ లండన్ తదితర ప్రముఖ విద్యాసంస్థల ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశాలు కొనసాగించనున్నారు. అలాగే యునైటెడ్ కింగ్‌డమ్‌లోని ప్రముఖ క్రీడా సంస్థలు, నైపుణ్యాభివృద్ధి రంగ నాయకులతో చర్చలు జరిపి తెలంగాణతో భాగస్వామ్యాలను ఏర్పాటుచేసే దిశగా చర్యలు చేపట్టనున్నారు. సాధారణ భారతీయుడు హైదరాబాద్‌లోనే హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్, ఎంఐటీ, ఎల్‌బీఎస్, ఎల్ఎస్ఈ వంటి ప్రపంచస్థాయి సంస్థల విద్య, ధ్రువపత్రాలు పొందేలా చేయాలన్నదే తన లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణరైజింగ్ ప్రస్థానం ఎవరూ ఆపలేరని, యువత భవిష్యత్తు, రాష్ట్ర అభివృద్ధి, దేశ ప్రగతి రాజకీయాలకు అతీతంగా ముందుకు సాగాల్సిన అంశాలని ఆయన పేర్కొన్నారు.



## షావుకారు జానకి మృతి తీవ్ర విషాదకరం: సీఎం రేవంత్‌రెడ్డి

ఆగస్టు 22 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ప్రముఖ నటి, పద్మశ్రీ పురస్కార గ్రహీత షావుకారు జానకి మరణించారని తెలిసి ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. చిన్నతనం నుంచే నాటకాల్లో వివిధ పాత్రలు పోషిస్తూ కళారంగంలోకి ప్రవేశించిన షావుకారు జానకి దాదాపు ఏడు దశాబ్దాల పాటు చలనచిత్ర రంగంలో తనదైన ముద్ర వేశారని సీఎం పేర్కొన్నారు. 'షావుకారు' చిత్రంలో ఆమె కనబరిచిన అసమాన ప్రతిభతో షావుకారు జానకిగా ప్రేక్షకుల హృదయాల్లో స్థిరస్థానం సంపాదించుకున్నారని గుర్తుచేశారు. తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో దాదాపు 400 చిత్రాల్లో నటించడంతో పాటు హిందీ, మలయాళ చిత్రాల్లోనూ నటించి ప్రేక్షకులను మెప్పించారని తెలిపారు. పలు మేటి చిత్రాల్లో షావుకారు జానకి పోషించిన పాత్రలు ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని కొనియాడారు. చలనచిత్ర రంగంలో ఆమె లేని లోటు పూడ్చలేనిదని అన్నారు. భగవంతుడు షావుకారు జానకి ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తూ, ఆమె కుటుంబ సభ్యులకు, అభిమానులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన సంతాపాన్ని, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి

### పాలన, విద్య, ప్రజా విధానాలపై ఆక్స్‌ఫర్డ్ అధ్యాపకులతో చర్చలు

ఆగస్టు 22 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ప్రపంచంలోనే అత్యంత పురాతన, ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ఒకటైన ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయాన్ని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి సందర్శించారు. దాదాపు 900 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ విశ్వవిద్యాలయంలో తెలంగాణ ప్రతినిధి బృందంతో కలిసి పర్యటించిన ముఖ్యమంత్రి, అక్కడి విద్యా, పరిశోధనా వాతావరణాన్ని పరిశీలించారు. అనంతరం ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ పరిధిలోని బ్లావాట్‌నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌ను సందర్శించారు. ఆక్స్‌ఫర్డ్ అనుబంధ విద్యాసంస్థల్లోని నూతన సంస్థల్లో ఒకటైన ఈ విద్యాసంస్థలో ప్రొఫెసర్ మాయా ట్యూడర్, ప్రొఫెసర్ ఫైసల్ దేవ్జీ తెలంగాణ ప్రతినిధి బృందాన్ని ఆహ్వానించి క్యాంపస్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావుతో పాటు ఇతర అధికారులు, ప్రతినిధులు పాల్గొనగా తెలంగాణకు సంబంధించిన పలు అంశాలు, సమర్థ పాలన, విద్యా రంగ అభివృద్ధి, ప్రజా విధానాలు, ఉన్నత విద్యలో అంతర్జాతీయ భాగస్వామ్య అవకాశాలపై చర్చలు జరిగాయి. ప్రపంచ స్థాయి విద్యా సంస్థలతో తెలంగాణ అనుబంధాన్ని మరింత బలోపేతం చేయడం, రాష్ట్ర యువతకు అంతర్జాతీయ ప్రమాణాల విద్యా అవకాశాలు అందించడంపై కూడా సమావేశంలో అభిప్రాయాలు పంచుకున్నారు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయానికి భారతదేశంతో ప్రత్యేక అనుబంధం ఉందని, మాజీ ప్రధానమంత్రి దివంగత ఇందిరా గాంధీ ఈ విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా అధికారులు గుర్తుచేశారు.



## భోగాపురం విమానాశ్రయంలో తొలిసారి కమర్షియల్ ఫ్లైట్‌లో మంత్రి నారా లోకేష్

ఆగస్టు 22 (సందేశం టైమ్స్ ప్రతినిధి): భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంలో కార్యకలాపాలు ప్రారంభమైన తర్వాత తొలిసారి సాధారణ ప్రయాణికులతో కలిసి కమర్షియల్ ఫ్లైట్‌లో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రయాణించారు. భోగాపురం విమానాశ్రయానికి చేరుకున్న నారా లోకేష్‌కు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పల్నాయుడు, ఎమ్మెల్యేలు లోకం నాగమాధవి, విష్ణుకుమార్‌రాజు, ఈశ్వర్‌రావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, విజయనగరం పార్లమెంట్ పార్టీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున, విశాఖపట్నం పార్లమెంట్ పార్టీ అధ్యక్షుడు చోడే వెంకట పట్టాభిరామ్, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు తదితరులు ఘన స్వాగతం పలికారు.

## 65 కేసుల్లో రూ.8.29 కోట్ల బకాయిల పరిష్కారం.. ఎంఎస్ఈలకు తెలంగాణ ప్రభుత్వం అండ

### ఓడీఆర్, సమాధాన్ విధానాలతో వేగవంతమైన పరిష్కారం.. పీఎఫ్ఆర్‌డీఏ, టీఆర్ఈడీఎస్ భాగస్వామ్యాలతో మరింత బలోపేతం







హైదరాబాద్, ఆగస్టు 22 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలకు (ఎంఎస్ఈలు) ఆలస్యమైన చెల్లింపుల నుంచి ఉపశమనం కల్పించడంతో పాటు వ్యాపార నిర్వహణను మరింత సులభతరం చేసే దిశగా తెలంగాణ ప్రభుత్వం పరిశ్రమలు, వాణిజ్య శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ)లో ఎంఎస్ఈల ఆలస్య చెల్లింపులు, రాజీ పరిష్కారం, ఆన్‌లైన్ వివాద పరిష్కారంపై ప్రత్యేక సదస్సు నిర్వహించింది. కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ, తెలంగాణ ప్రభుత్వం, ఎఫ్‌టీసీసీఐ, ఎంఎస్ఎంఈ-డీఎఫ్ఓ హైదరాబాద్, ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ సెంటర్, పరిశ్రమల ప్రతినిధులు, న్యాయ నిపుణులు, ఆన్‌లైన్ వివాద పరిష్కార సంస్థలు, ఆర్థిక సంస్థలు, లబ్ధిదారులైన వ్యాపార సంస్థలు పాల్గొన్న ఈ సదస్సులో మొత్తం 65 కేసులకు సంబంధించి రూ.8.29 కోట్ల విలువైన బకాయిల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఇందులో 10 కేసులకు సంబంధించి రూ.1.40 కోట్ల చెక్కులు అందజేయడం లేదా విడుదల చేయడం, 26 ఆన్‌లైన్ వివాద పరిష్కార కేసుల్లో రూ.89 లక్షల పరిష్కారం, సమాధాన్ విధానంలో 29 కేసులకు సంబంధించి రూ.6 కోట్ల పరిష్కారం సాధించారు. కార్యక్రమంలో చెక్కులు, రాజీ ఉత్తర్వులు అందజేయడం ద్వారా ఆలస్య చెల్లింపుల పరిష్కారం ద్వారా సూక్ష్మ, చిన్న పరిశ్రమలకు ప్రత్యక్ష ప్రయోజనం కల్పించే విధానాన్ని ప్రభుత్వం ప్రదర్శించింది. ఒక బకాయి చెల్లింపు ఆలస్యం అయితే అది కేవలం ఒక బిల్లుకే పరిమితం కాకుండా సంస్థల నిర్వహణ మూలధనం, ఉద్యోగుల వేతనాలు, ముడిసరుకు కొనుగోళ్లు, చట్టబద్ధ చెల్లింపులు, తదుపరి ఆర్డర్లను స్వీకరించే సామర్థ్యంపై ప్రభావం చూపుతుందని, దీర్ఘకాలిక న్యాయపరమైన వివాదాలు వ్యాపార సంబంధాలను దెబ్బతీసే అవకాశం ఉన్నందున రాజీ పరిష్కారం, ఆన్‌లైన్ వివాద పరిష్కారం ద్వారా వేగవంతమైన, సాంకేతిక ఆధారిత పరిష్కారానికి మార్గం సుగమం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. సదస్సులో ఈ విధానాల ద్వారా ప్రయోజనం పొందిన ఎనిమిది మంది పారిశ్రామికవేత్తలు తమ అనుభవాలను పంచుకున్నారు. అలాగే 'ఓడీఆర్ సక్సెస్ స్టోరీస్' ప్రచురణను విడుదల చేసి, అవగాహన, విజయగాథలకు సంబంధించిన వీడియోను ప్రదర్శించారు. కేంద్ర ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ ర్యాంప్ కార్యక్రమ డైరెక్టర్ అంకితా పాండే ముఖ్య అతిథిగా పాల్గొని ఎంఎస్ఈల ఆలస్య చెల్లింపుల సమస్యలకు వేగవంతమైన, పారదర్శక, తక్కువ వ్యయంతో కూడిన పరిష్కారాల కోసం ఆన్‌లైన్ వివాద పరిష్కార విధానాల ప్రాధాన్యతను వివరించారు. తెలంగాణ పరిశ్రమల కమిషనర్ జె. నిఖిల్ చక్రవర్తి రాష్ట్ర ప్రభుత్వం సూక్ష్మ, చిన్న పరిశ్రమలకు వ్యాపార నిర్వహణను సులభతరం చేయడంపై దృష్టి సారించిందని, చెల్లింపులకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారంలో వ్యవస్థీకృత రాజీ విధానం కీలక సాధనంగా ఉంటుందని తెలిపారు. ఎఫ్‌టీసీసీఐ ఉపాధ్యక్షుడు కె.కె. మహేశ్వరి, ఎంఎస్ఎంఈ-డీఎఫ్ఓ హైదరాబాద్ జాయింట్ డైరెక్టర్, హెచ్ఓఓ సి.ఎస్.ఎస్. రావు, ఐఏఎంసీ హైదరాబాద్ సీఈఓ, రిజిస్ట్రార్ ఏ.జె. జవాద్, పీఎఫ్ఆర్‌డీఏ చీఫ్ జనరల్ మేనేజర్ అరుముగరంగరాజన్, పరిశ్రమల అదనపు డైరెక్టర్ డి. శ్రీనివాస్ నాయక్, తెలంగాణ ప్రభుత్వం జాయింట్ డైరెక్టర్ (ఎంఎస్ఎంఈ) కె. మధుకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు. సదస్సులో పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్‌డీఏ)తో పాటు టీఆర్ఈడీఎస్ భాగస్వామ్య సంస్థలు ఎం1 ఎక్స్ఛేంజ్, ఆర్ఎక్స్ఐఎల్, క్రెడ్ఎక్స్‌లతో అవగాహన ఒప్పందాలు కుదిరాయి. ఈ భాగస్వామ్యాల ద్వారా సంస్థలకు అధికారిక ఆర్థిక, చెల్లింపు విధానాలపై అవగాహన పెంచడంతో పాటు ఎంఎస్ఈ రంగానికి సంస్థాగత సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రభుత్వ సహకారం, చట్టబద్ధ ఆలస్య చెల్లింపు పరిష్కార వ్యవస్థలు, రాజీ పరిష్కారం, డిజిటల్ వివాద పరిష్కార వేదికలు, ఆర్థిక సంస్థలు, పరిశ్రమలను ఒకే వ్యవస్థలోకి తీసుకురావడం ద్వారా దేశంలోనే తొలిసారిగా అమలు చేసిన ఈ విధానం ఇతర ప్రాంతాల్లోనూ అనుసరించగల నమూనాగా నిలిచే అవకాశం ఉందని పరిశ్రమలు, వాణిజ్య శాఖ పేర్కొంది. ఎంఎస్ఈలు తమకు రావాల్సిన న్యాయబద్ధమైన బకాయిలను వేగంగా పొందేలా చేయడం, నిర్వహణ మూలధనాన్ని రక్షించడం, వివాదాలపై సమయం, వ్యయాన్ని తగ్గించడం, సాధ్యమైన చోట వ్యాపార సంబంధాలను కొనసాగించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు.

# ఎల్‌నినో సవాళ్లను సమష్టిగా ఎదుర్కొందాం: మంత్రి తుమ్మల

## నీటి భద్రతకు ముందస్తు ప్రణాళిక.. పంటల వైవిధ్యంతో రైతులకు అండగా నిలుద్దాం





ఆగస్టు 22 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ఎల్‌నినో ప్రభావంతో రానున్న సవాళ్లను ముందుగానే గుర్తించి తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా సన్నద్ధం చేయాలని పలువురు మంత్రులు అధికారులకు సూచించారు. ఎల్‌నినోను విపత్తుగా కాకుండా అవకాశంగా మార్చుకోవాలని, ముఖ్యంగా అక్టోబర్, నవంబర్ నెలల్లో పంటలు చేతికొచ్చే సమయంలో నీటి కొరత తలెత్తకుండా ఇప్పటి నుంచే సమగ్ర ప్రణాళికతో చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. రాజేంద్రనగర్‌లోని టీజీఐఆర్‌డీలో ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు వి.బి.-జీ రామ్-జీ, సమీకృత వ్యవసాయ కుంటల పాత్రపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, సీఎస్ సంజయ్ జాజు, వ్యవసాయం, పశుసంవర్ధక, పంచాయతీరాజ్ శాఖల కార్యదర్శులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ప్రస్తుతం భూగర్భ జలాలు పెరిగే స్థాయిలో వర్షపాతం నమోదు కాలేదని, ప్రధాన జలాశయాల్లోకి కూడా ఆశించిన స్థాయిలో నీరు చేరలేదని తెలిపారు. రాబోయే రోజుల్లో అందుబాటులో ఉండే భూగర్భ జలాలపై రోజువారీగా అంచనాలు రూపొందించి, ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆటో స్టార్టర్లతో రేయింబవళ్లు మోటార్లు నడిపి భూగర్భ జలాలను వృథా చేయకుండా పంటకు అవసరమైన మేరకే నీటిని వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలోని 44 వేల చెరువులను సంరక్షించి వర్షపు నీటిని గరిష్ఠంగా నిల్వ చేసుకోవాల్సిన అవసరం ఉందని, చెరువుల్లోకి వర్షపు నీటిని మళ్లించి నిల్వ చేస్తే పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరిగి బోర్లు పనిచేసే అవకాశం ఉంటుందని వివరించారు. వాగులు, నదుల్లో అవసరమైన ప్రాంతాల్లో ట్రెంచ్‌లు, రాక్‌ఫిల్ డ్యామ్‌లు ఏర్పాటు చేసి నీటిని భూగర్భంలోకి ఇంకేలా చేయాలని సూచించారు. ఎల్‌నినో వంటి ప్రకృతి వైపరీత్యాలను సవాలుగా కాకుండా అవకాశంగా మలచుకోవాలని, కొత్త సాంకేతికత కోసం మాత్రమే ఎదురుచూడకుండా గతంలో మన పెద్దలు అనుసరించిన నీటి సంరక్షణ పద్ధతులను తిరిగి ఆచరణలోకి తీసుకురావాలని అన్నారు. వ్యవసాయం, పశుసంవర్ధక, మత్స్య, అటవీ, పంచాయతీరాజ్, నీటిపారుదల తదితర శాఖలు సమన్వయంతో పనిచేస్తే ఎలాంటి విపత్కర పరిస్థితినైనా సమర్థంగా ఎదుర్కోవచ్చన్నారు. జిల్లా స్థాయిలో అధికారులు ప్రతిరోజూ సమన్వయ సమావేశాలు నిర్వహించి తమ జిల్లాల్లో చేపట్టాల్సిన చర్యలపై స్పష్టమైన ప్రణాళిక రూపొందించుకోవాలని, మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రైతులు, ప్రజలకు నమ్మకమైన మార్గదర్శకత్వం అందించాలని కోరారు. నిజాయితీగా, నిబద్ధతతో పనిచేసే అధికారుల మాటను రైతులు, ప్రజలు విశ్వసిస్తారని, అధికారులు మానవీయ కోణంలో వ్యవహరించాలని అన్నారు. రైతులను ఒకే పంటపై ఆధారపడే పరిస్థితి నుంచి బయటకు తీసుకురావాలని, పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహిస్తూ ధరల్లో హెచ్చుతగ్గులు వచ్చినా రైతుకు నష్టం కలగకుండా చూడాలని సూచించారు. ఉద్యాన పంటలకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు ఆయిల్‌పామ్ సాగును విస్తరించాలని, ఆయిల్‌పామ్‌తో పాటు కోకో, వక్క, మిరియాలు వంటి అంతర పంటలను ప్రోత్సహించి రైతులకు అదనపు ఆదాయ అవకాశాలు కల్పించాలని తెలిపారు. తెలంగాణను దేశంలోనే ఆయిల్‌పామ్ సాగులో అగ్రగామి రాష్ట్రంగా నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, అన్ని జిల్లాల్లో ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ముందుగానే కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసిందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కోవడం, పంటల వైవిధ్యాన్ని పెంచడం తదితర అంశాలపై అధికారులతో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో పశువులు, అటవీ జంతువులకు కూడా నీటి లభ్యత ఉండేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణులకు నీటి సదుపాయం కల్పించాలని సూచించారు. "ఎల్‌నినో కాదు.. ఎల్‌నినో తాత వచ్చినా తెలంగాణ రైతులను నిలబెట్టగలిగే శక్తి రాష్ట్రానికి ఉండాలి" అనే లక్ష్యంతో అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు కలిసి పనిచేయాలని మంత్రి పిలుపునిచ్చారు. "ప్రతి గ్రామానికి నీటి బడ్జెట్ – ప్రతి రైతుకు నీటి భద్రత – ప్రతి ఎకరానికి వాతావరణ మార్పులను తట్టుకునే సామర్థ్యం" అనే లక్ష్యంతో అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ గతంలోనూ దేశం ఎల్‌నినో ప్రభావాలను ఎదుర్కొందని, 1951 నుంచి ఇప్పటి వరకు 12 సార్లు ఎల్‌నినో పరిస్థితులను భారత్ చవిచూసిందని తెలిపారు. కరువును ఎలా ఎదుర్కోవాలనే అవగాహన రైతులకు ఉన్నప్పటికీ, ఆ అవగాహనను ఆచరణలో పెట్టేలా చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. పంటల మార్పిడి ద్వారా వ్యవసాయ రంగంలో మార్పులు తీసుకురావచ్చనే విషయాన్ని రైతులకు వివరించి తగిన సలహాలు అందించాలని సూచించారు. ఆస్ట్రేలియా వంటి దేశాలు ముందస్తు కార్యాచరణతో ఎల్‌నినో ప్రభావాలను సమర్థవంతంగా ఎదుర్కొన్నాయని, తెలంగాణలోనూ ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని అన్నారు. కరువు పరిస్థితుల్లో పశువుల పెంపకం, సంరక్షణపై కూడా అన్నదాతలకు అవగాహన కల్పించాలని మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు.

## సర్కారు దూరదృష్టి.. రాయదుర్గంలో భూముల ధర రికార్డు బ్రేక్ ఎకరాకు రూ.264 కోట్లు.. 5.25 ఎకరాల విక్రయంతో టీజీఐఐసీకి రూ.1,386 కోట్ల ఆదాయం

హైదరాబాద్, ఆగస్టు 22 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రాయదుర్గంలోని భూముల ధరలు మరోసారి సరికొత్త రికార్డు సృష్టించాయి. తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) నిర్వహించిన ఈ-వేలంలో ప్లాట్ నంబర్ పీ1కు ఎకరాకు ఏకంగా రూ.264 కోట్ల రికార్డు ధర పలికింది. హైదరాబాద్‌లో ఇటీవల కాలంలో ప్రభుత్వ సంస్థ నిర్వహించిన భూముల వేలంలో ఇదే అత్యధిక ధరగా అధికారులు పేర్కొన్నారు. మొత్తం 5.25 ఎకరాల భూమి విక్రయం ద్వారా టీజీఐఐసీకి రూ.1,386 కోట్ల భారీ ఆదాయం సమకూరింది. పీ1 ప్లాట్‌కు ఎకరాకు రూ.175 కోట్లను రిజర్వ్ ధరగా నిర్ణయించగా, పోటాపోటీగా సాగిన వేలంలో చివరకు ఎకరాకు రూ.264 కోట్ల ధర పలికింది. ఇది రిజర్వ్ ధర కంటే దాదాపు 51 శాతం అధికం కావడం విశేషం. హైదరాబాద్‌పై ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలు, జాతీయ స్థాయి డెవలపర్లలో పెరుగుతున్న విశ్వాసానికి ఈ వేలం ఫలితం నిదర్శనమని అధికారులు తెలిపారు. రాయదుర్గంలో భూముల విలువ వేగంగా పెరుగుతున్నదానికి ఈ వేలం మరో ఉదాహరణగా నిలిచిందన్నారు. ఇదే ప్రాంతంలో టీజీఐఐసీ గత మే నెలలో నిర్వహించిన వేలంలో ఎకరాకు రూ.237 కోట్ల ధర పలకగా, కేవలం మూడు నెలల్లోనే ఆ రికార్డును అధిగమిస్తూ పీ1 ప్లాట్‌కు ఎకరాకు రూ.264 కోట్ల ధర రావడం హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో పెరుగుతున్న డిమాండ్‌కు సంకేతంగా భావిస్తున్నారు. కీలక వ్యాపార ప్రాంతాలు, అత్యుత్తమ మౌలిక సదుపాయాలు, పెట్టుబడులకు అనుకూల వాతావరణం కారణంగా హైదరాబాద్‌పై పెట్టుబడిదారుల ఆసక్తి మరింత పెరుగుతోందని అధికారులు పేర్కొన్నారు. ఎంఎస్‌టీసీ ఈ-ఆక్షన్ వేదిక ద్వారా పూర్తి పారదర్శకంగా వేలం నిర్వహించగా, ప్రముఖ అంతర్జాతీయ రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ జేఎల్ఎల్ ప్రత్యేక ట్రాన్సాక్షన్ అడ్వైజర్‌గా వ్యవహరించింది. జాతీయ స్థాయి ప్రముఖ డెవలపర్లు వేలంలో పాల్గొనడంతో పోటీ తీవ్రంగా సాగింది. ఈ సందర్భంగా టీజీఐఐసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. శశాంక్ మాట్లాడుతూ పీ1 ప్లాట్ వేలం విజయవంతం కావడం తెలంగాణ భవిష్యత్తుపై డెవలపర్లకు ఉన్న విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. ఇది కేవలం భూమికి లభించిన అధిక ధర మాత్రమే కాదని, పారదర్శకత, అత్యుత్తమ మౌలిక సదుపాయాలు, పెట్టుబడిదారులకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పిస్తున్న తెలంగాణ అభివృద్ధి విధానానికి లభించిన గుర్తింపుగా పేర్కొన్నారు. హైదరాబాద్ అంతర్జాతీయ స్థాయి వ్యాపార, పెట్టుబడుల కేంద్రంగా వేగంగా ఎదుగుతున్నదని ఈ వేలం మరోసారి నిరూపించిందన్నారు. ఈ విజయానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు అందిస్తున్న దూరదృష్టితో కూడిన నాయకత్వమే కారణమని టీజీఐఐసీ పేర్కొంది. పారదర్శకతకు పెద్దపీట వేస్తూ పరిశ్రమలు, పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపింది. తాజా వేలం ఫలితాలతో హైదరాబాద్ దేశంలోని అగ్రశ్రేణి పెట్టుబడి కేంద్రాల సరసన మరింత బలంగా నిలిచిందని అధికారులు వెల్లడించారు.




## గ్లోబల్ స్థాయిలో ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు: సీఎస్ సంజయ్ జాజు

హైదరాబాద్, ఆగస్టు 22 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా డిసెంబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్–ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సమ్మిట్ ఏర్పాట్లపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించిన సీఎస్, కార్యక్రమ నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలపై అధికారులతో చర్చించారు. దేశంలోని వివిధ దేశాల రాయబారులు, హైకమిషనర్లకు ప్రత్యేక ఆహ్వానాలు పంపడంతో పాటు ఆయా దేశాల్లోని ప్రముఖ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులను సమ్మిట్‌కు ఆహ్వానించాలని సూచించారు. దేశంలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖ పారిశ్రామిక సంస్థలు, శాస్త్ర సాంకేతిక, వైద్య, విద్య, మౌలిక వసతులు తదితర రంగాల నిపుణులు, ప్రముఖులు సమ్మిట్‌లో పాల్గొనేలా ముందుగానే ఆహ్వానాలు పంపాలని ఆదేశించారు. సమ్మిట్ నిర్వహణ కోసం అవసరమైన వివిధ కమిటీలను ఏర్పాటు చేసి, ప్రతి కమిటీకి స్పష్టమైన బాధ్యతలు అప్పగిస్తూ సమన్వయంతో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణలోని వివిధ రంగాల సామర్థ్యం, పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా ప్రత్యేక ఎక్స్‌పోలను ఏర్పాటు చేసి, వాటిలో ప్రముఖ కంపెనీలు, సంస్థలు భాగస్వాములయ్యేలా చర్యలు చేపట్టాలని సీఎస్ పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్–ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు మార్గదర్శకత్వం అందించేందుకు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, నిపుణులతో కూడిన సలహా మండలిని ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సమ్మిట్‌ను అత్యున్నత ప్రమాణాలతో నిర్వహించి తెలంగాణను ప్రపంచస్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా మరింతగా ప్రతిష్ఠించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సంజయ్ జాజు ఆదేశించారు. సమావేశంలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక్, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ అజిత్ రెడ్డి, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో విద్యా కార్యక్రమాలు చేపట్టండి.. ఆక్స్‌ఫర్డ్ వర్సిటీకి సీఎం రేవంత్ ఆహ్వానం:



ఆగస్టు 22 (సందేశం టైమ్స్ ప్రతినిధి): తెలంగాణలో విద్యా కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టాలని ప్రపంచ ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీకి ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆహ్వానం పలికారు. తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందంలో భాగంగా ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీని సందర్శించిన సీఎం, తెలంగాణతో ఆక్స్‌ఫర్డ్ భాగస్వామ్య అవకాశాలు, రాష్ట్ర యువతకు ప్రపంచస్థాయి విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి అవకాశాలపై ప్రముఖ విద్యావేత్తలతో చర్చించారు. బ్లావాట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌కు చెందిన ప్రొఫెసర్ మాయా ట్యూడర్, బేలియోల్ కాలేజీకి చెందిన ప్రొఫెసర్ ఫైసల్ దేవ్జీతో సమావేశమైన సీఎం, హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విద్యా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించి, ఆక్స్‌ఫర్డ్ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలు, పరిశోధనా సామర్థ్యాలను హైదరాబాద్‌కు తీసుకురావాలని కోరారు. తెలంగాణ యువత, ఉద్యోగ నిపుణులతో కలిసి పనిచేసేందుకు ప్రొఫెసర్లు సానుకూలంగా స్పందించారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ఆక్స్‌ఫర్డ్ ప్రతినిధి బృందాన్ని పంపాలని ఆహ్వానించారు. అనంతరం సోమర్‌విల్ కాలేజీని సందర్శించిన సీఎం, అక్కడ విద్యాభ్యాసం చేసిన దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటాన్ని సందర్శించారు. అనంతరం జీఎంఆర్ గ్రూప్ నిర్వహిస్తున్న యుటిలిటా బౌల్‌ను సందర్శించి తెలంగాణలో ప్రపంచస్థాయి క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి పెట్టుబడులు పెట్టాలని జీఎంఆర్ ప్రతినిధులను ఆహ్వానించారు.

## బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో వృక్ష దివస్.. తులసి మొక్కలు నాటిన కార్యకర్తలు



ఆగస్టు 22 (సందేశం టైమ్స్ ప్రతినిధి): బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో వృక్ష దివస్ సందర్భంగా బొజ్జగుడెం తండాలో తులసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బొజ్జగుడెం తండాకు చెందిన బజరంగ్ దళ్ కార్యకర్తలు గుగులోతు ఉపేందర్, గుగులోతు ధీరజ్, గుగులోతు హేమంత్, గుగులోతు సురేష్, గుగులోతు సాత్విక్, గుగులోతు జఫ్ఫా, ధారావత్ చక్రి, భూక్యా ప్రవీణ్, భూక్యా భాను, శ్రీరాములవారి సేవా కార్యక్రమాల్లో నిత్యం పాల్గొంటున్న ధారావత్ వినోద్‌తో పాటు అనంతగిరి మండలానికి చెందిన బండి గోపి, నరసింహ పాల్గొన్నారు. సూర్యాపేట జిల్లా బజరంగ్ దళ్ కన్వీనర్ యాదా నవీన్, కోదాడ మండలం హనుమాన్ చాలీసా ప్రముఖ్ కొండా నరేష్, అనంతగిరి మండల ఖండ బజరంగ్ దళ్ కన్వీనర్ భూక్యా అఖిల్ రాథోడ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. పరిసర పరిరక్షణతో పాటు పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.



## రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం.. ప్రత్యామ్నాయ మార్గాలు వినియోగించాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్

ఆగస్టు 22 (మెదక్ నియోజకవర్గం, సందేశం టైమ్స్ ప్రతినిధి): చేగుంట (గాంధీ చౌక్) నుంచి మెదక్ వెళ్లే రహదారిలో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ) నిర్మాణ పనులు ఆగస్టు 23 అర్ధరాత్రి 12 గంటల నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు చేగుంట నుంచి మెదక్ వెళ్లే రహదారిలో ఎల్‌సీ నంబర్ 228టీ వద్ద రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేస్తామని తెలిపారు. ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు ఎల్‌సీ గేటు వద్ద ఉన్న సీసీ రోడ్డు నుంచి పాత జాతీయ రహదారి, చేగుంట పట్టణ సరిహద్దు మీదుగా ప్రస్తుత ఆర్‌యూబీ నుంచి బస్టాండ్ ఎదురుగా ఉన్న వెంచర్ మార్గాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్లు, బస్సులు, డీసీఎం వ్యాన్లు, ఇతర వాహనాలు నార్సింగి నుంచి శంకరంపేట (ఆర్) మీదుగా మిర్జాపల్లి డబుల్ రోడ్డు మార్గాన్ని వినియోగించుకోవాలని, ట్రక్కులు, భారీ వాహనాలు రామాయంపేట లేదా నర్సాపూర్ మార్గాల్లో ప్రయాణించాలని తెలిపారు. మాసాయిపేట నుంచి మెదక్ వెళ్లే వాహనాలు శంకరంపేట (ఆర్) మీదుగా ధర్పల్లి రోడ్డు మార్గాన్ని, తూప్రాన్ నుంచి మెదక్ వెళ్లే వాహనాలు వెల్దుర్తి–ఉప్పులింగాపూర్–గవ్వలపల్లి మార్గాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. నిర్మాణ పనుల కారణంగా వాహనదారులు ఇబ్బందులు పడకుండా ముందస్తుగా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని, ట్రాఫిక్ పోలీసులు ఇచ్చే సూచనలు, ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## నూతన చేయూత పింఛన్లకు దరఖాస్తులు చేసుకోవాలి.. ఆగస్టు 31 చివరి తేదీ: కలెక్టర్ ప్రతిమా సింగ్

ఆగస్టు 22 (మెదక్ నియోజకవర్గం, సందేశం టైమ్స్ ప్రతినిధి): నూతన చేయూత పింఛన్లకు అర్హులైన లబ్ధిదారులు ఆగస్టు 31లోగా మండల, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. దరఖాస్తుల స్వీకరణలో సమస్యలు ఎదురైతే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను లేదా 8008556112 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. దివ్యాంగులకు యూఐడీ ధ్రువీకరణ పత్రం లేని పక్షంలో ముందుగా మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని, ఆగస్టు 26న మెదక్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి (జీజీహెచ్)లో ప్రత్యేక యూఐడీ శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. పింఛన్ దరఖాస్తులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాల విషయంలో సమస్యలు ఎదురైతే హెల్ప్‌డెస్క్ ద్వారా సహాయం అందిస్తామని, అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను సకాలంలో స్వీకరించి వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సంబంధిత ఎంపీడీఓలను కలెక్టర్ ఆదేశించారు.




## యువతను విస్మరిస్తే పాలకులకు పతనం తప్పదు: కూనంనేని సాంబశివరావు

ఆగస్టు 22 (సందేశం టైమ్స్ ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ శెట్టి సురేష్): చింతకాని మండలం కొదుమూరు గ్రామంలోని పగడాల భరత్ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఖమ్మం జిల్లా 25వ మహాసభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ యువతను విస్మరిస్తే పాలకులకు పతనం తప్పదని అన్నారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తగ్గిపోయి దేశంలో నిరుద్యోగం పెరుగుతోందని, ఉపాధి లేక యువశక్తి నిర్వీర్యమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ జనాభాలో సగభాగంగా ఉన్న యువత తమ హక్కుల కోసం పోరాడాలని, పోరాటాల ద్వారానే హక్కులను సాధించుకోవచ్చని అన్నారు. సమాజాన్ని మార్చగలిగే శక్తి యువతకు ఉందని, ముఖ్యంగా జెన్-జీ యువత ప్రశ్నించే తత్వంతో ముందుకు వస్తుండటంతో పాలకుల్లో అసహనం పెరుగుతోందని విమర్శించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'దిమాగీ నక్సల్స్' వంటి పదాలను ప్రస్తావించడం ప్రశ్నించే యువతను భయపెట్టే ప్రయత్నమేనని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఉన్న ఉద్యోగాలను కూడా తొలగిస్తోందని, కార్పొరేట్ వర్గాల ప్రయోజనాల కోసం పనిచేస్తోందని విమర్శించారు. మారుతున్న సామాజిక, రాజకీయ పరిణామాలను యువత నిరంతరం అధ్యయనం చేసి సైద్ధాంతిక, నైతిక, శారీరక బలాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. మహాసభకు ముందు వందలాది మంది యువకులతో గ్రామంలో భారీ ప్రదర్శన నిర్వహించగా, అనంతరం ఏఐవైఎఫ్ పతాకాన్ని కొండపర్తి గోవిందరావు, అమరవీరుల స్థూపాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఆవిష్కరించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వలివుల్లా ఖాద్రి, కల్లూరి ధర్మేంద్ర మాట్లాడుతూ భారతదేశ యువజన ఉద్యమాలకు ఏఐవైఎఫ్ దిక్సూచిగా నిలుస్తోందని, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం నిరంతరం పోరాడుతుందని తెలిపారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ సాధన కోసం ఉద్యమాన్ని కొనసాగిస్తామని వెల్లడించారు. మహాసభలో సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, కొండపర్తి గోవిందరావు, నానబాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మెనూలో ఒకటి.. పేషెంట్లకు అందేది మరొకటి?




ఆగస్టు 22 (జోగిపేట, సందేశం టైమ్స్ ఉమ్మడి మెదక్ జిల్లా కోఆర్డినేటర్ వి. వెంకటేశం): జోగిపేట ఏరియా 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు ప్రభుత్వం నిర్దేశించిన డైట్ మెనూ ప్రకారం భోజనం అందడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన జనరల్ డైట్ మెనూ బోర్డులో పేర్కొన్న ఆహార పదార్థాలకు, రోగులకు రోజువారీగా అందుతున్న భోజనానికి తేడా ఉంటోందని పలువురు రోగులు, వారి బంధువులు ఆరోపిస్తున్నారు. మెనూ ప్రకారం ఉదయం ఇడ్లీ, సాంబార్ లేదా చట్నీ, పొంగల్, కిచిడీ, ఉప్మా, బ్రెడ్ వంటి అల్పాహారం అందించాల్సి ఉండగా ఎక్కువగా పాలు, బ్రెడ్ లేదా ఉప్మా మాత్రమే అందుతున్నట్లు చెబుతున్నారు. మధ్యాహ్నం అన్నం లేదా చపాతీలు, కూర, ఆకుకూర పప్పు, సాంబార్, ఉడకబెట్టిన గుడ్డు, అరటిపండు, పెరుగు లేదా మజ్జిగ అందించాల్సి ఉన్నప్పటికీ అన్నం, పప్పు, చారు, వంకాయ–టమాట కూర, గుడ్డు, అరటిపండు మాత్రమే ఇస్తున్నారని ఆరోపిస్తున్నారు. రాత్రి కూడా మెనూలో పేర్కొన్న పలు ఆహార పదార్థాలకు బదులుగా అన్నం, పప్పు, చారు, క్యాబేజీ–టమాట కూరతోనే సరిపెడుతున్నారని రోగుల బంధువులు పేర్కొంటున్నారు. హెచ్‌పీడీ రోగులకు సాయంత్రం పాలు, చిక్కీ లేదా ఉడికించిన పల్లీలు, రాగిజావా అందించాల్సి ఉండగా అవి నిబంధనల ప్రకారం అందుతున్నాయా అనే విషయాన్ని అధికారులు తనిఖీ చేయాలని, ఫుడ్ కాంట్రాక్టర్ పనితీరును పరిశీలించి డైట్ మెనూ కచ్చితంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని రోగులు, వారి బంధువులు కోరుతున్నారు.



## కోరిన వరాలు ఇచ్చే వరలక్ష్మీ దేవి

ఆగస్టు 22 (జహీరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి): జహీరాబాద్ పట్టణంలోని వేమారెడ్డి కాలనీలో బిరాదర్ అన్నపూర్ణ పాటిల్ స్వగృహంలో శుక్రవారం వరలక్ష్మీ దేవి వ్రత వేడుకలను భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిరాదర్ అన్నపూర్ణ పాటిల్ మాట్లాడుతూ శ్రేయస్సు, సంపదలకు అధిదేవత అయిన లక్ష్మీదేవిని ఆరాధించే పవిత్రమైన వరలక్ష్మీ వ్రతాన్ని శ్రావణమాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం రోజున ఆచరిస్తారని తెలిపారు. అమ్మవారి అనుగ్రహంతో కుటుంబాల్లో సుఖశాంతులు, ఐశ్వర్యం, సంతాన సౌభాగ్యం కలగాలని కోరుకుంటూ మహిళలు భక్తిశ్రద్ధలతో ఈ వ్రతాన్ని నిర్వహిస్తారని పేర్కొన్నారు. పూజా కార్యక్రమంలో అన్నపూర్ణ పాటిల్, లక్ష్మి, స్వాతి, తుల్జమ్మ, శివరాణి (నందిని) తదితరులు పాల్గొన్నారు.

## స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తులు ఆహ్వానం



ఆగస్టు 22 (సంగారెడ్డి, సందేశం టైమ్స్ ఉమ్మడి మెదక్ జిల్లా కోఆర్డినేటర్ బి. వెంకటేశం): సంగారెడ్డి జిల్లా పరిధిలో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు 2026–27 విద్యా సంవత్సరానికి దీనదయాళ్ స్పర్శ్ యోజన పథకం కింద అందించే స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవాలని సంగారెడ్డి డివిజన్ పోస్టల్ ఎస్పీ డాక్టర్ శ్రీహరి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల్లో ఫిలాటలీ (తపాలా బిళ్లల సేకరణ)పై ఆసక్తిని పెంపొందించడం, స్టాంపుల సేకరణను అభిరుచిగా ప్రోత్సహించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. అర్హత కలిగిన 6 నుంచి 9వ తరగతి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని, పథకం కింద ఎంపికైన ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.6 వేల స్కాలర్‌షిప్ అందజేయనున్నట్లు పోస్టల్ అధికారులు వెల్లడించారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు ఎల్లో అలర్ట్




ఆగస్టు 22 (సంగారెడ్డి, సందేశం టైమ్స్ ఉమ్మడి మెదక్ జిల్లా కోఆర్డినేటర్ వి. వెంకటేశం): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలో ఈ నెల 28వ తేదీ వరకు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



# పట్టణ డైరెక్టరీ ఏర్పాటుకు అధికారుల సమన్వయం

ఆగస్టు 22 (సూర్యాపేట, సందేశం టైమ్స్ జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి): డిస్ట్రిక్ట్ సెన్సస్ హ్యాండ్‌బుక్‌లో భాగంగా సూర్యాపేట పట్టణ డైరెక్టరీ ఏర్పాటుకు అవసరమైన సమగ్ర సమాచారాన్ని సేకరించేందుకు వివిధ శాఖల అధికారులతో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ హన్మంత రెడ్డి అధ్యక్షతన శుక్రవారం మున్సిపల్ కార్యాలయ కౌన్సిల్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. పట్టణంలోని విద్య, వైద్యం, రోడ్లు, భవనాలు, మున్సిపల్, సీడీపీఓ, విద్యుత్, పంచాయతీరాజ్, వ్యవసాయం తదితర శాఖలకు సంబంధించిన సదుపాయాలు, వసతులు, మౌలిక సదుపాయాల వివరాలను సేకరించి పట్టణ డైరెక్టరీని రూపొందించనున్నట్లు కమిషనర్ తెలిపారు. 2025 డిసెంబర్ 31 నాటికి అందుబాటులో ఉన్న సమాచారాన్ని ప్రామాణికంగా తీసుకుని డైరెక్టరీని రూపొందించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పట్టణంలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ, ప్రజా సదుపాయాలకు సంబంధించిన పూర్తి వివరాలను సంబంధిత శాఖల అధికారులు సకాలంలో అందించాలని, శాఖల వారీగా సరైన సమాచారాన్ని సేకరించడం ద్వారా పట్టణ డైరెక్టరీని సమగ్రంగా రూపొందించేందుకు సహకరించాలని సూచించారు. సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ నాగప్రసాద్, చీఫ్ ప్లానింగ్ ఎస్ఓ రామారావు, రాజేష్, మండల విద్యాధికారి శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ ఈఈ, డీపీఓ సోమయ్య, టౌన్ ప్లానింగ్ సిబ్బంది అఖిల్ రెడ్డి, శివాజీ, సెక్షన్ క్లర్క్ గోపారపు రాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



# వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి

ఆగస్టు 22 (నారాయణఖేడ్, సందేశం టైమ్స్ ప్రతినిధి): టేక్మల్ మండలం కోరంపల్లి గ్రామానికి చెందిన నారాయణఖేడ్ మండల గిర్దావర్ (ఆర్ఐ) మాధవ్‌రెడ్డి కుమార్తె వివాహ వేడుకలు సంగారెడ్డి పట్టణంలోని జేఎస్ఆర్ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకలకు నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. వారి దాంపత్య జీవితం ఆనందం, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రమేష్ చౌహాన్, పీఆర్ డిఈ మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ చందర్ నాయక్, శంకర్ నాయక్, శ్రీను తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



# రిపోర్టర్ సత్యానందం కుటుంబానికి ఆర్థిక చేయూత.. పిల్లల భవిష్యత్తు కోసం రూ.4.50 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్

ఆగస్టు 22 (బోనకల్, సందేశం టైమ్స్ ఖమ్మం ఇన్‌చార్జ్ శెట్టి సురేష్): బోనకల్ మండలం గోవిందాపురం గ్రామానికి చెందిన రిపోర్టర్ మంద సత్యానందం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి మిత్రులు, దాతలు ఆర్థిక చేయూత అందించారు. యూటీఎఫ్ జిల్లా కోశాధికారి వల్లంకొండ రాంబాబు ఆధ్వర్యంలో "సత్యానందం కుటుంబానికి ఆర్థిక చేయూత" పేరుతో ఏర్పాటు చేసిన గ్రూపు ద్వారా సుమారు 200 మంది దాతల నుంచి రూ.4,52,000 సేకరించారు. సేకరించిన మొత్తాన్ని సత్యానందం ముగ్గురు పిల్లల భవిష్యత్తుకు ఉపయోగపడేలా శుక్రవారం లక్ష్మీపురం సొసైటీలో వారి పేర్లపై ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. అనంతరం ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్లను సొసైటీ చైర్మన్ మాదినేని వీరభద్రరావు, సర్పంచ్ మంద కరుణ, ఉప సర్పంచ్ కారంగుల చంద్రయ్య, యూటీఎఫ్ జిల్లా కోశాధికారి వల్లంకొండ రాంబాబు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యానందం అకాల మరణంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబానికి దాతలు మానవతా దృక్పథంతో స్పందించి సహాయం అందించడం అభినందనీయమన్నారు. దాతలు అందించిన మొత్తాన్ని పిల్లల చదువులు, భవిష్యత్తుకు భరోసాగా ఉండేలా ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని నిర్ణయించామని తెలిపారు. కష్టకాలంలో ఒక కుటుంబానికి మిత్రులు, దాతలు అండగా నిలవడం మానవత్వానికి నిదర్శనమని, భవిష్యత్తులోనూ సత్యానందం కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. ఆర్థిక సహాయం అందించిన ప్రతి దాతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వల్లంకొండ సురేష్, కొమ్ము శ్రీనివాసరావు, ఆరుగు జానేష్, తమ్మారపు లక్ష్మణరావు, పసుపులేటి వెంకటేశ్వర్లు, ఎర్రబోయిన అప్పారావు, నల్లమోతు నాగేశ్వరరావు, ముత్తరపు రవి, మంద జాన్, కల్యాణపు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# వార్షిక తనిఖీల్లో హద్నూర్ పీఎస్, జహీరాబాద్ డీఎస్పీ కార్యాలయాల పరిశీలన





ఆగస్టు 22 (సంగారెడ్డి, సందేశం టైమ్స్ ప్రతినిధి): వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ శుక్రవారం హద్నూర్ పోలీస్ స్టేషన్, జహీరాబాద్ డీఎస్పీ కార్యాలయాలను తనిఖీ చేశారు. హద్నూర్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన ఎస్పీ, డీఎస్పీ సైదా నాయక్‌తో కలిసి స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. అనంతరం పోలీస్ స్టేషన్, డీఎస్పీ కార్యాలయ పరిసరాల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది కిట్ ఆర్టికల్స్‌ను పరిశీలించి కేసులకు సంబంధించిన ఆస్తులు, వాహనాలను జాగ్రత్తగా భద్రపరచాలని, రికార్డుల్లో పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు సీసీటీఎన్ఎస్-2.0లో నమోదు చేయాలని సూచించారు. మిస్సింగ్, దీర్ఘకాలిక పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించి పగలు, రాత్రి బీట్‌లలో నిఘా పెంచాలని ఆదేశించారు. సీసీటీఎన్ఎస్-2.0, టీఎస్-కాప్, హెచ్ఆర్ఎంఎస్, ఈ-సాక్ష్య, సైబర్ క్రైమ్ పోర్టల్, సీడీఆర్, పోర్టబుల్ ఫింగర్‌ప్రింట్ తదితర సాంకేతిక పరిజ్ఞానంపై సిబ్బంది పూర్తి స్థాయి పట్టు సాధించాలని సూచించారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యలను పరిష్కరించాలని, రౌడీషీటర్లు, సస్పెక్ట్ హిస్టరీ షీటర్లపై నిరంతరం నిఘా ఉంచాలని తెలిపారు. జహీరాబాద్ డీఎస్పీ కార్యాలయ తనిఖీలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, పోక్సో, అత్యాచారం, డౌరీ డెత్ కేసుల్లో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్లను గుర్తించి సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని, జాతీయ రహదారి పరిధిలోని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, రాష్ట్ర సరిహద్దుకు సమీప ప్రాంతం కావడంతో అక్రమ రవాణాపై నిఘా పెంచి నాకాబందీ నిర్వహించాలని సూచించారు. పోలీస్ స్టేషన్, డీఎస్పీ కార్యాలయ రికార్డుల నిర్వహణ సంతృప్తికరంగా ఉందని పేర్కొన్న ఎస్పీ అధికారులు, సిబ్బంది పనితీరును అభినందించి విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి రివార్డులు ప్రకటించారు. ఈ తనిఖీల్లో జహీరాబాద్ డీఎస్పీ సైదా నాయక్, రూరల్ సీఐ హనుమంతు, టౌన్ సీఐ రవి, సబ్ డివిజన్ ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

# పాపన్నపేటలో విద్యార్థిని.. ఆవంచలో వ్యక్తి ఆత్మహత్యలు





మెదక్, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 22: మెదక్ జిల్లాలో రెండు వేర్వేరు విషాద ఘటనలు చోటుచేసుకున్నాయి. పాపన్నపేట మండలంలో 14 ఏళ్ల ఎనిమిదో తరగతి విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడగా, నర్సాపూర్ మండలం ఆవంచ గ్రామంలో చంద్రం (45) మృతి చెందాడు. పాపన్నపేట ఘటనలో బాలిక కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతూ పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందినప్పటికీ సమస్య తగ్గకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శుక్రవారం కుటుంబ సభ్యులు వ్యవసాయ పనులకు వెళ్లి తిరిగి వచ్చేసరికి బాలిక మృతి చెందినట్లు గుర్తించారు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు ఆవంచ గ్రామానికి చెందిన చంద్రం రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టగా, గురువారం గ్రామ శివారులోని ఓ చెట్టు వద్ద మృతదేహాన్ని గుర్తించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించి, ఘటనకు గల కారణాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సీఎల్పీలో ఎమ్మెల్యేల మీడియా సమావేశం.. సుష్మిత వ్యాఖ్యలపై ఆగ్రహం



ఆగస్టు 22 (హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి): హైదరాబాద్ సీఎల్పీ కార్యాలయంలో అందుబాటులో ఉన్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ తనయ సుష్మిత చేసిన విమర్శలపై ఎమ్మెల్యేలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, అసమ్మతి నేతలకు హెచ్చరికలు జారీ చేశారు. పార్టీకి సంబంధించిన అంశాలపై బహిరంగంగా విమర్శలు చేయడం సరికాదని, పార్టీ క్రమశిక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని సూచించారు. ఇదిలా ఉండగా, కాంగ్రెస్ సీనియర్ నేత కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై ఎందుకు మాట్లాడటం లేదని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా ఎమ్మెల్యేలు తడబాటుకు గురయ్యారు. సమావేశంలో నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, బీర్ల ఐలయ్య, మధుసూదన్‌రెడ్డి, రేవూరి ప్రకాష్‌రెడ్డి, దొంతి మాధవరెడ్డి, మందుల సామేల్, వెడ్మ బొజ్జు, వేముల వీరేశం, బుయ్యని మనోహర్‌రెడ్డి, కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, బాలు నాయక్, వీర్లపల్లి శంకర్, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణతో పాటు ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, బస్వరాజు సారయ్య పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ఎంపీ స్వర్గీయ పట్లోళ్ల మాణిక్ రెడ్డి 8వ వర్ధంతి




మెదక్ నియోజకవర్గం సందేశం టైమ్స్ ప్రతినిధి ఆగస్టు 22: మాజీ లోక్‌సభ సభ్యుడు స్వర్గీయ పట్లోళ్ల మాణిక్ రెడ్డి 8వ వర్ధంతి సందర్భంగా డాకూర్ గ్రామంలోని మాజీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పట్లోళ్ల మంజుశ్రీ జైపాల్ రెడ్డి నివాసంలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ పాల్గొని మాణిక్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుంటూ నాయకులు, కార్యకర్తలు ఆయన ఆశయాలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు పి. నారాయణ ముదిరాజ్, అర్జునయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ డి.బి. నాగభూషణం, సర్పంచ్ వసంత్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఎ. శంకరయ్య, లింగా గౌడ్, బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు పట్లూరి శివశేఖర్, నాగరత్నం గౌడ్, చాపల వెంకటేశం, సార శ్రీధర్, మాచర్ల విజయ్ కుమార్, బిర్ల శంకర్, ఉస నాగరాజు, ఖాజా పాషా, రఫీక్, ఇమ్రాన్ ఖాన్, మొగులయ్య, పరిపూర్ణం, లింగం, ప్రశాంత్, కమలమ్మతో పాటు భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# నూతన గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్

జోగిపేట, ఆగస్టు 22 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ వి. వెంకటేశం): జోగిపేటకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కటుకం ప్రవీణ్ కుమార్ సోదరుల నూతన గృహప్రవేశ వేడుకలో మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ పలువురు బీఆర్ఎస్ నాయకులతో కలిసి పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన గృహంలో కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ పి. జైపాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ పి. నారాయణ ముదిరాజ్, మాజీ ఏఎంసీ చైర్మన్ డి.బి. నాగభూషణం, బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు పట్లూరి శివశేఖర్, నాగరత్నం గౌడ్, చాపల వెంకటేశం, సార శ్రీధర్, మాచర్ల విజయ్ కుమార్, బిర్ల శంకర్, ఉస నాగరాజు, రఫీక్, ఇమ్రాన్ ఖాన్, జెన్నా విజయ్ కుమార్, ప్రదీప్ గౌడ్ తదితరులు పాల్గొని ప్రవీణ్ కుమార్ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.



# చిప్పల్ తుర్తి గ్రామంలో కూరగాయల మార్కెట్ ప్రారంభం

మెదక్ నియోజకవర్గం సందేశం టైమ్స్ ప్రతినిధి ఆగస్టు 22 : చిప్పల్ తుర్తి గ్రామంలో ప్రజలకు తాజా కూరగాయలు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు స్థానిక రైతులు, కూరగాయల వ్యాపారులకు సౌకర్యం కల్పించే లక్ష్యంతో నూతన కూరగాయల మార్కెట్‌ను బుధవారం ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ మాస్కురి సుధాకర్, ఉప సర్పంచ్ కృష్ణగౌడ్, మాస్కురి కిష్టయ్య, మాస్కురి రత్నయ్య, మాస్కురి మొగులయ్య ఆధ్వర్యంలో గ్రామ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దల సమక్షంలో మార్కెట్ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ఒకే చోట నాణ్యమైన తాజా కూరగాయలు అందుబాటులోకి రావడంతో పాటు స్థానికంగా కూరగాయలు సాగు చేసే రైతులు తమ ఉత్పత్తులను నేరుగా విక్రయించుకునేందుకు ఈ మార్కెట్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. గ్రామంలో కూరగాయల మార్కెట్ ఏర్పాటు కావడంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. మార్కెట్‌ను పరిశుభ్రంగా ఉంచుతూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించేందుకు గ్రామస్థులు, వ్యాపారులు సహకరించాలని గ్రామ పాలకవర్గం కోరింది.



# ది హిందూ సీనియర్ ఫోటో జర్నలిస్ట్ జి.ఎన్. రావుకు అరుదైన గౌరవం

సందేశం టైమ్స్ ప్రతినిధి ఆగస్టు 22: ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన ఫోటోగ్రఫీ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన ది హిందూ సీనియర్ ఫోటో జర్నలిస్ట్ జి.ఎన్. రావుకు ఘన సత్కారం లభించింది. ఫోటోగ్రఫీ రంగంలో ఆయన అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తిస్తూ ఈ గౌరవం దక్కింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జి.ఎన్. రావుకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా చేతుల మీదుగా జి.ఎన్. రావు ప్రథమ బహుమతిని అందుకున్నారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ పోటీలో ప్రథమ బహుమతి సాధించడం పట్ల ఫోటో జర్నలిస్టులు, జర్నలిజం వర్గాలు హర్షం వ్యక్తం చేస్తూ జి.ఎన్. రావును అభినందించారు.




# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను భావితరాలకు తెలియజేయాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్ నియోజకవర్గం సందేశం టైమ్స్ ప్రతినిధి ఆగస్టు 22: బహుజన నాయకుడు, పోరాట యోధుడు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను భావితరాలకు తెలియజేసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ కోరారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతిని పురస్కరించుకుని బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పసుపులేరు ఒడ్డున రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఉన్న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి కలెక్టర్ ప్రతిమా సింగ్ ముఖ్యఅతిథిగా హాజరై పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెదక్ జిల్లా కవులు, కళాకారులకు నిలయమని, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవిత చరిత్రను సమగ్రంగా రచించి పుస్తక రూపంలో భావితరాలకు అందించాలని సూచించారు. అణగారిన వర్గాలు, శ్రమజీవుల కష్టాన్ని దోచుకునే వారిని ఎదిరించి పోరాడుతూ సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం తపించిన మహనీయుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. ఆయన జీవితం, పోరాట స్ఫూర్తి నేటి తరానికి చైతన్యాన్ని అందిస్తుందని, ఆయన ఆశయాలు, సేవలు, పోరాట గాథలను ప్రతి ఒక్కరికీ తెలియజేసేలా కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, బీసీ సంక్షేమ అధికారి ఉపేందర్, బీసీ సంక్షేమ సహాయ అధికారి గంగా కిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నరసింహారెడ్డి, బీసీ సంక్షేమ సంఘం మెదక్ జిల్లా అధ్యక్షులు నోముల శ్రీకాంత్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు రమేష్ గౌడ్, బీసీ కుల సంఘాల ప్రతినిధులు దామోదర్ గౌడ్, జనార్దన్ గౌడ్, కృష్ణ గౌడ్, చింతకింది కృష్ణగౌడ్, లక్ష్మీనారాయణ గౌడ్, ఇతర కుల సంఘాల ప్రతినిధులు, బీసీ సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష

సందేశం టైమ్స్ సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి ఆగస్టు 22: ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా పోస్టు డ్రాఫ్ట్ కార్యకలాపాలు, డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ప్రచురణ తదుపరి చేపట్టాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. పోస్టు డ్రాఫ్ట్ దశలో చేపట్టాల్సిన ప్రక్రియను రాజకీయ పార్టీ ప్రతినిధులకు కలెక్టర్ వివరించారు. ఎస్ఐఆర్‌లో భాగంగా డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం ఓటర్ల జాబితాలో ఏవైనా సందేహాలు, అభ్యంతరాలు లేదా ఫిర్యాదులు ఉంటే నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలను అందజేసినట్లు తెలిపారు. రాజకీయ పార్టీ ప్రతినిధులు ఓటర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించి, జాబితాలోని వివరాలను పరిశీలించేలా ప్రజలను ప్రోత్సహించాలని, ప్రక్రియ సజావుగా సాగేందుకు అధికారులకు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డీఆర్వో ప్రేమ్ రాజ్, సి-సెక్షన్ సూపరింటెండెంట్ రాజేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నుంచి సీహెచ్ రాజేశ్వరరావు, బీజేపీ నుంచి చల్లమల్ల నరసింహ, ఎండీ హబీద్, బీఎస్పీ నుంచి ఎం. స్టాలిన్, బీఆర్ఎస్ నుంచి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నుంచి డి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## బోల్కమ్మ పెద్ద చెరువు భూమిపై కబ్జా ఆరోపణలు

మెదక్/అల్లాదుర్గం ఆగస్టు 22 (సందేశం టైమ్స్ ప్రతినిధి): అల్లాదుర్గం మండలంలోని గడిపెద్దాపూర్ గ్రామ శివారులో ఉన్న బోల్కమ్మ పెద్ద చెరువు భూమిపై కబ్జా ఆరోపణలు వెల్లువెత్తాయి. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని భూమిని కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. చెరువు భూమిలోకి జేసీబీ యంత్రాలతో కాలువలు తవ్వడంతో పాటు భారీ మోటార్ల సహాయంతో నీటిని తోడుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ విషయం అధికారుల దృష్టికి రావడంతో ఇరిగేషన్ శాఖ అధికారులు చెరువు ప్రాంతాన్ని పరిశీలించి పరిస్థితిపై వివరాలను సేకరించినట్లు తెలిపారు. చెరువు భూములు ఆక్రమణకు గురికాకుండా అధికారులు సమగ్ర సర్వే నిర్వహించి ఎఫ్‌టీఎల్ పరిధిని స్పష్టంగా గుర్తించి, ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేలా రక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. చెరువుల పరిధిలోని భూములు ఆక్రమణలకు గురైతే నీటి నిల్వ సామర్థ్యం తగ్గడంతో పాటు సాగునీరు, భూగర్భ జలాలు, పరిసర ప్రాంతాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో పూర్తి స్థాయిలో విచారణ జరిపి చెరువు భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.



## ఎస్సీ మహిళా కౌన్సిలర్‌ను అవమానించిన ఘటనపై చర్యలు తీసుకోవాలి: ఎంఆర్‌పీఎస్

నర్సాపూర్, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 22: నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని 1వ వార్డు హనుమంతాపూర్‌లో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి సంబంధించి ఎస్సీ మహిళా కౌన్సిలర్ మినికె నరసమ్మను అవమానించారనే ఆరోపణలపై విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎంఆర్‌పీఎస్ మెదక్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎంఆర్‌పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షులు చెట్లపల్లి యాదగిరి మాదిగ మాట్లాడుతూ, ఆగస్టు 15న 1వ వార్డు హనుమంతాపూర్‌లో కౌన్సిలర్ మినికె నరసమ్మ జెండా ఆవిష్కరించకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులుగా పేర్కొంటున్న మాజీ బీఆర్ఎస్ మున్సిపల్ చైర్మన్ దుర్గాప్పగారి అశోక్ గౌడ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీ మహిళా కౌన్సిలర్‌ను అవమానించిన ఘటనపై నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి స్పందించి, సంబంధిత వ్యక్తిపై పార్టీ పరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి బాధిత కుటుంబానికి అండగా నిలిచి, ఘటనపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. సంబంధిత అధికారులు ఈ విషయంపై సమగ్ర విచారణ నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చి, బాధ్యులు ఎవరైనా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు కోరారు. లేనిపక్షంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యబద్ధంగా తదుపరి కార్యాచరణ చేపడతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సీనియర్ నాయకురాలు బోడ పద్మక్క, గుమ్మడిదల శ్రీకాంత్ మాదిగ, మండల ఎంఆర్‌పీఎస్ సీనియర్ నాయకులు ఆశనుల్లా దుర్గాదాస్ మాదిగ, చిలిపిచెడ్ మండల సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## గ్రామ సర్పంచులు, మండల ప్రత్యేక అధికారులతో సమీక్ష సమావేశం

మెదక్ నియోజకవర్గం, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 22: అందోల్ మండలంలో మండల ప్రత్యేక అధికారి పి. కిషన్ ఆధ్వర్యంలో అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు, వివిధ శాఖల ప్రత్యేక అధికారులతో ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రగతి నివేదికలను సర్పంచులకు వివరించగా, గ్రామాల వారీగా సర్పంచులు అడిగిన సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. వ్యవసాయ శాఖ అధికారి మాట్లాడుతూ మండలంలోని ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు (క్రాప్ బుకింగ్) చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. పంటను విక్రయించే సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పంట నమోదు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. మండల రెవెన్యూ అధికారులు నూతన రేషన్ కార్డుల జారీ ప్రక్రియతో పాటు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ తదితర సంక్షేమ పథకాల అమలు తీరును వివరించారు. వన మహోత్సవం, జలసిరి కార్యక్రమాల్లో భాగంగా గ్రామ పంచాయతీల్లో చేపడుతున్న కార్యక్రమాలపై సర్పంచులు వివరాలు వెల్లడించారు. గ్రామ ప్రజలను ఈ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేలా అవగాహన కల్పించాలని అధికారులు సూచించారు. గ్రామాల్లో ఫారం పాండ్స్, నీటి సంరక్షణ గుంతలు ఏర్పాటు చేయడంతో పాటు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి పి. కిషన్ సూచించారు. అర్హులైన ప్రతి పెన్షన్ లబ్ధిదారుడికి నూతన పింఛన్లు అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రతి గ్రామంలో నిర్దేశించిన లక్ష్యాల మేరకు విస్తృతంగా మొక్కలు నాటాలని సూచించారు. గ్రామాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో సర్పంచులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా అధికారులు సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ మధుకర్ రెడ్డి, ఎంపీడీవో రాజేష్ కుమార్, వివిధ గ్రామాల సర్పంచులు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: సీఐటీయూ

వట్పల్లి, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 22: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలంలో గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ వట్పల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మండల ఎంపీడీవో కార్యాలయం ఎదుట దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో పారిశుద్ధ్యం, ప్రజలకు అవసరమైన సేవలను అందించడంలో కీలకంగా పనిచేస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా వారి న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరారు. కార్మికులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో సమస్యలు పరిష్కరించే వరకు దశలవారీగా పోరాటాన్ని కొనసాగిస్తామని సీఐటీయూ నాయకులు స్పష్టం చేశారు. ఈ దీక్షలో సీఐటీయూ నాయకులు మహేష్, సీహెచ్. యాదగిరి, ఈ. మహేష్, బి. భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణీల సమస్యలపై ఆరా తీసిన ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్



నారాయణఖేడ్, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 22: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మున్సిపల్ కేంద్రంలోని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీలకు ఎదురవుతున్న సమస్యలను సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. బుధవారం స్కానింగ్, వైద్యుల సలహాల కోసం ఆసుపత్రికి వచ్చిన గర్భిణీల వద్దకు వెళ్లి వారికి ఎదురవుతున్న ఇబ్బందులు, అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కూర్చోవడానికి సరైన సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని కొందరు గర్భిణీలు సూపరింటెండెంట్ దృష్టికి తీసుకురాగా, వెంటనే స్పందించిన డాక్టర్ రమేష్ సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన కుర్చీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే గర్భిణీలతో పాటు ప్రతి రోగి పట్ల వైద్యులు, సిబ్బంది మర్యాదగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అవసరమైన వైద్య పరీక్షలు, స్కానింగ్, వైద్యుల సలహాలను సకాలంలో అందించాలని సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఆసుపత్రిలో మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేసి గర్భిణీలు, వృద్ధులు, చిన్నపిల్లలు, అత్యవసర పరిస్థితుల్లో వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక శ్రద్ధతో వైద్య సేవలు అందిస్తామని పేర్కొన్నారు. ప్రతి రోగి సమస్యను సానుకూలంగా విని, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిపై ప్రజలకు మరింత నమ్మకం కలిగేలా వైద్య సేవలను మెరుగుపరుస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండే ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని డాక్టర్ రమేష్ స్పష్టం చేశారు.

## నర్సాపూర్ గర్భిణులకు "మాతృదేవోభవ" కానుక



నర్సాపూర్, సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్, ఆగస్టు 22: నర్సాపూర్ పట్టణ ప్రాంతంలోని గర్భిణీ స్త్రీల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో "మాతృదేవోభవ" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పరిధిలోని 130 మంది గర్భిణీ స్త్రీలకు ఉచితంగా ప్రొటీన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలకు అవసరమైన పోషకాహారం అందించడం ద్వారా తల్లి, బిడ్డ ఆరోగ్యానికి తోడ్పడాలనే ఉద్దేశంతో "మాతృదేవోభవ" కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ప్రతి తల్లి ఆరోగ్యంగా ఉండటం, ప్రతి బిడ్డ ఆరోగ్యంగా జన్మించడం సమాజం మొత్తం బాధ్యత అని పేర్కొన్నారు. గర్భిణీ స్త్రీలకు ప్రొటీన్ కిట్లను అందజేయడంతో పాటు వారి ఆరోగ్య పరిస్థితులు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణీలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, స్థానిక ప్రజాప్రతినిధులు, గర్భిణీ స్త్రీల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నాగులవంచలో ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు






నాగులవంచ, ఆగస్టు 22, 2026 — సందేశం టైమ్స్ ఖమ్మం ఇన్‌చార్జి శెట్టి సురేష్: నాగులవంచ గ్రామంలో భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న శ్రీ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. నాయకులు మాట్లాడుతూ దేశంలో సాంకేతికత, కంప్యూటర్, టెలికమ్యూనికేషన్ రంగాల అభివృద్ధికి విశేష కృషి చేసిన దూరదృష్టి కలిగిన నాయకుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. యువతలో నూతన ఆలోచనలు, నైపుణ్యాలను ప్రోత్సహిస్తూ దేశ ప్రగతికి బలమైన పునాదులు వేశారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి కృషి చేయడంతో పాటు ప్రజాస్వామ్యంలో యువత భాగస్వామ్యాన్ని పెంచేందుకు ఓటు హక్కు వయస్సును 21 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాలకు తగ్గించి యువతకు ప్రజాస్వామ్య ప్రక్రియలో మరింత ప్రాధాన్యత కల్పించారని తెలిపారు. ఆధునిక భారతదేశ నిర్మాణానికి రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాలను నేటి యువత ముందుకు తీసుకెళ్లాలని నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో నాగులవంచ మాజీ సర్పంచ్ కంభం వీరభద్రం, జోనల్ ఇన్‌చార్జి అలస్యం బసవయ్య, నాగులవంచ ఉపసర్పంచ్ అంబటి శరత్ కుమార్, దేవాలయ కమిటీ సభ్యులు వెచ్చ మంగపతిరావు, వెముల కృష్ణ, పడిశాల మైశయ్య, సిరసాని రమణప్రసాద్, వార్డు సభ్యులు కంభం సునిత-శేషయ్య, గురిజాల జయకుమార్, చెట్టిపోగు నరేష్, నాయకులు నెల్లూరి రమేష్, యల్లంపల్లి సతీష్, తన్నీరు వెంకటేశ్వరరావు, నన్నాక నాగేశ్వరరావు, వంకాయలపాటి రమణ, అంబటి శ్రీను, ఐనాల నాగేశ్వరరావు, అంబటి వెంకటేశ్వర్లు, అంబటి వినయ్, జొన్నలగడ్డ శ్రీను, మరికంటి వినోద్, దేశబోయిన శ్రీనివాసరావు, మేకల నాగేశ్వరరావు, వేషాల సీతారాములు, కాకర్ల వెంకన్న, పడిశాల రాములు, గార్లపాటి సుదర్శనరావు, మల్లెపూల వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.



## నవ భారత నిర్మాత... నవ యువతకు స్ఫూర్తి ప్రదాత

సంగారెడ్డి, ఆగస్టు 22, 2026 — సందేశం టైమ్స్ జిల్లా కోఆర్డినేటర్: మాజీ ప్రధానమంత్రి, భారతరత్న స్వర్గీయ శ్రీ రాజీవ్ గాంధీ 82వ జయంతి సందర్భంగా హత్నూర మండలం దౌల్తాబాద్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం నర్సాపూర్ పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి, జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా సీనియర్ ఫోటోగ్రాఫర్లకు ఘన సన్మానం



మెదక్/అల్లాదుర్గం, ఆగస్టు 22, 2026 — సందేశం టైమ్స్ రూరల్ రిపోర్టర్ కుమార్: ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మెదక్ జిల్లా తరఫున ప్రతి మండలం నుంచి ముగ్గురు సీనియర్ ఫోటోగ్రాఫర్లను ఎంపిక చేసి ఘనంగా సన్మానించి మెమెంటోలు అందజేశారు. ఇందులో భాగంగా పాపన్నపేట మండలం నుంచి సీనియర్ ఫోటోగ్రాఫర్లు దాసరి శ్రీకాంత్, పుర శ్రీకాంత్, ఎల్లుగారి రాములు మెమెంటోలు అందుకున్నారు. ఈ మెమెంటోలను జిల్లా అధ్యక్షులు కంచి ఆనంద్, ప్రధాన కార్యదర్శి బండా చంద్రశేఖర్, కోశాధికారి కూచున శ్రీధర్ చేతుల మీదుగా అందజేశారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఫోటోగ్రాఫర్ల సేవలను గుర్తించి వారిని సన్మానించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

## నిరుపేదల గూడును కూల్చొద్దు



రామచంద్రాపురం, ఆగస్టు 22, 2026 — సందేశం టైమ్స్ ఉమ్మడి మెదక్ జిల్లా కోఆర్డినేటర్ వి. వెంకటేశం: రామచంద్రాపురం మండలంలోని బండలగూడ గ్రామంలో గత 50 ఏళ్లకు పైగా స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న నిరుపేద కుటుంబాల ఇళ్లను కూల్చివేయకుండా బాధితులకు న్యాయం చేయాలని మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మాజీ జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు మాసనూరి చంద్రశేఖర్ కోరారు. బండలగూడలో దశాబ్దాలుగా నివాసం ఉంటున్న కుటుంబాలకు ఇళ్లను కూల్చివేస్తామంటూ రైల్వే శాఖ అధికారులు నోటీసులు జారీ చేసిన విషయాన్ని మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. 50 ఏళ్లకు పైగా అక్కడే నివాసం ఉంటున్న కుటుంబాలకు రైల్వే శాఖ నుంచి నోటీసులు రావడం బాధాకరమని, ఇళ్ల తొలగింపుతో అనేక నిరుపేద కుటుంబాలు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని వివరించారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా రైల్వే శాఖ ఉన్నతాధికారులతో చర్చించాలని యాదగిరి యాదవ్ ఎంపీని కోరారు. దీనిపై స్పందించిన ఎంపీ రఘునందన్‌రావు బండలగూడలో రైల్వే నోటీసులు అందుకున్న బాధితుల సమస్యను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీ రఘునందన్‌రావుతో కలిసి మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మాజీ జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు మాసనూరి చంద్రశేఖర్ దక్షిణ మధ్య రైల్వే జీఎంను కలిసి బండలగూడలోని స్థానిక పరిస్థితులతో పాటు అక్కడ నివసిస్తున్న కుటుంబాల ఆర్థిక, సామాజిక పరిస్థితులను వివరించారు. దశాబ్దాలుగా అక్కడే నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు అన్యాయం జరగకుండా మానవతా దృక్పథంతో సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విక్రమ్, శ్రీరాములు, దశరథ్, నితీష్, యేసు, సతీష్, ప్రభాకర్‌తో పాటు రైల్వే నోటీసులు అందుకున్న బాధిత కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

# జహీరాబాద్ డివిజన్‌లో తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ

## జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు ఐక్యంగా కృషి చేయాలి






జహీరాబాద్, ఆగస్టు 22, 2026 — సందేశం టైమ్స్ ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గ కేంద్రంలో తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బస్వరాజ్ ఆధ్వర్యంలో నూతన కమిటీ నియామక సమావేశం నిర్వహించారు. తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు శెట్టి అశోక్, జాతీయ ప్రధాన కార్యదర్శి శెట్టి వెంకటేష్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి జాతీయ సంయుక్త కార్యదర్శి తమ్మాలి సంగమేశ్వర్, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కృష్ణ, రాష్ట్ర కార్యదర్శి నాగేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జహీరాబాద్ డివిజన్ అధ్యక్షుడిగా ఎం. రాజేందర్, జనరల్ సెక్రెటరీగా సి.ఎస్. శ్రీనివాస్, ఆందోల్ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా ఎం.ఎస్. రాజు, కోశాధికారిగా కే. శ్రీనివాస్‌ను నియమించారు. నూతనంగా నియమితులైన పదాధికారులకు జహీరాబాద్ పట్టణ సీఐ ఆర్. రవి నియామక పత్రాలను అందజేసి అభినందించారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం సంఘాన్ని మరింత బలోపేతం చేసి, జర్నలిస్టుల వృత్తిపరమైన సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేయాలని సంఘం నాయకులు సూచించారు. నూతన పదాధికారులు తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణతో పాటు వృత్తి గౌరవాన్ని కాపాడేందుకు నిబద్ధతతో పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు, వివిధ మీడియా సంస్థలకు చెందిన జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా మోర్చా అధ్యక్షురాలు మీనా గౌడ్‌కు ఘన సత్కారం




సంగారెడ్డి, ఆగస్టు 22, 2026 — సందేశం టైమ్స్ ఉమ్మడి మెదక్ జిల్లా కోఆర్డినేటర్ వి. వెంకటేశం: బీజేపీ సంగారెడ్డి జిల్లా మహిళా మోర్చాలో నూతనంగా వివిధ బాధ్యతలకు నియమితులైన పదాధికారులు జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు శ్రీమతి బండారి మీనా గౌడ్‌ను ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం బండారి మీనా గౌడ్ నూతనంగా బాధ్యతలు చేపట్టిన మహిళా మోర్చా పదాధికారులను కాషాయ కండువాలతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని, మహిళలను రాజకీయంగా మరింత చైతన్యవంతులను చేస్తూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. నూతన బాధ్యతలు చేపట్టిన పదాధికారులు పార్టీ అభివృద్ధితో పాటు మహిళా మోర్చాను మరింత బలోపేతం చేసేందుకు నిబద్ధతతో కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షురాలు అనిత స్వామి, జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు చందాపురం ఉదయశ్రీ, జిల్లా మహిళా మోర్చా జనరల్ సెక్రటరీ తేజశ్రీ, జిల్లా మహిళా మోర్చా సెక్రటరీ గీత, బసమ్మ, మహిళా మోర్చా సోషల్ మీడియా కన్వీనర్ మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## ఫిలిప్పీన్స్ విదేశాంగ కార్యాలయాన్ని సందర్శించిన రాష్ట్ర ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ బృందం

మనీలా, ఆగస్టు 22, 2026 — సందేశం టైమ్స్ ప్రతినిధి: ఫిలిప్పీన్స్ దేశ రాజధాని మనీలాలోని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యాలయాన్ని తెలంగాణ రాష్ట్ర ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ సభ్యుల బృందం సందర్శించి, విదేశాంగ శాఖ అధికారులతో విస్తృత స్థాయిలో చర్చలు జరిపింది. ఫిలిప్పీన్స్ ప్రభుత్వం విదేశాల్లో పనిచేస్తున్న ప్రవాసుల కోసం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలు, అత్యుత్తమ విధానాలను తెలంగాణ బృందానికి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. బృందానికి సారథ్యం వహిస్తున్న కమిటీ ఛైర్మన్ డా. బి.ఎం. వినోద్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న తెలంగాణ కార్మికులకు అండగా నిలిచేందుకు తీసుకోవాల్సిన చర్యలు, ప్రవాస కార్మికుల సంక్షేమం తదితర అంశాలపై ఫిలిప్పీన్స్ అధికారులతో విపులంగా చర్చించారు. ఫిలిప్పీన్స్‌లో అమలు చేస్తున్న వలస కార్మికుల విధానాలను అధ్యయనం చేసి, తెలంగాణ రాష్ట్రం నుంచి గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న సుమారు 15 లక్షల మంది కార్మికులకు మరింత అండగా ఉండేలా త్వరలో సమగ్ర విధానాన్ని రూపొందించేందుకు చర్యలు తీసుకుంటామని ఆది శ్రీనివాస్, డా. ఆర్. భూపతి రెడ్డి తెలిపారు. ఫిలిప్పీన్స్ పర్యటనలో భారత విదేశాంగ శాఖ ఫస్ట్ సెక్రటరీ నీలేష్ కుమార్ రాయ్ తెలంగాణ ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ బృందానికి సంపూర్ణ సహకారం అందించారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నెంబర్: TGTEL/25/A0348, టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ-మెయిల్ : sandeshamtimes@gmail.com, : www.sandeshamtimes.com, (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్ SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522006.